# మానవతా విలువల పోషణ ద్వారా మానవజన్మను సార్థకము చేసుకోండి!

ఆధునికత పెరిగెను అంతులేక
ఆత్మవిద్యయు క్షీణించె అవధిలేక
సత్యధర్మంబు లన్నియు సమసిపోయె
ప్రేమ శాంతి అహింసలు పేదవడియె

సత్య ధర్మ అహింసలు శాంతిప్రేమ
మానవుని పంచప్రాణాలు మహిని యివియె
పంచప్రాణాలలో ప్రేమ యెంచ హెచ్చు
కాన హృదయాన ప్రేమను పెంచుకొనుడు

అధ్యాపకులారా!

ప్రపంచమునకు కావలిసిన ప్రధానమైన అంశములు మూడు. ఒకటి వస్తువుయొక్క ఉత్పత్తి. రెండవది ఉత్పత్తియైన వస్తువులను సంరక్షించుకొనే రక్షణ శక్తి. ఈ రెండిటికి తగిన తరిబీదునందించి శిక్షణను చేకూర్చే అధ్యాపకుడు, మూడవది. ఏతావాతా ఉత్పత్తి, రక్షణశక్తి, శిక్షణశక్తి, యీ మూడుకూడను ప్రపంచమునకు అత్యవసరమైనవి. వస్తువులను ఉత్పత్తిని చేసే వ్యక్తులు అత్యవసరము. రక్షణకు సైన్యము అత్యవసరము. ఉన్నతవిద్యను అందించి ఉత్తమ మార్గమునందు యీ ఉత్పత్తిని, రక్షణశక్తిని పెంచి పోషింపచేసేవారు ఆధ్యాపకులు. వీరు ముగ్గురిని దక్షకుడు, రక్షకుడు, శిక్షకుడు అని పిలుస్తూవచ్చారు. సమాజముయొక్క విశిష్టమైన కార్యభారములన్నికూడను యీ మువ్వురిపైననే ఆధారపడివుంటాయి. ఇందులో యే ఒక్కరు లేకపోయినప్పటికిని, సంస్థ లేక సమాజము మరియు ప్రకృతి పూర్ణవంతము కానేరదు. సంపదవుండియు దీనిని రక్షించే సైనికులు లేకుండిన సంపదలన్నికూడను శత్రువుచేతిలో పడి దేశము పేదరికముననుభవిస్తుంది.

sri sathyasai vachanamrutam

ఉత్పత్తి క్షీణించి కేవలము సైన్యమునే పెంచుకుంటూపోవటంచేత ప్రపంచమునకు భారమవుతుంది. ఉత్పత్తియందు, రక్షణయందు సరైన తరిబీదునిచ్చి శిక్షణను చేకూర్చే అధ్యాపకుడే లేకుండిన కేవలము దేశము ఒక విధమైన అంధత్వమును పొందుతుంది.

**ప్రేమ అనే పీటను సత్యము, ధర్మము, శాంతి అనే మూడు విలువలతో బిగించి భద్రపరచాలి**

కనుక, యీ ముప్వురుకూడను అన్యోన్య ఆశ్రితులు. ఈ ముప్వురు ముక్కాలిపీటవంటివారు. మూడు కాళ్లు వుండినంత మాత్రమున సరిపోదు. ఈ మూడు కాళ్లపైన సున్నితమైన ఒక పీట వుండాలి. ఈ పీటలేకుండిన యీ మూడు కాళ్లు నిరుపయోగమవుతాయి. ఈ పీటను యీ మూడు కాళ్లతో సంబంధపరచి దానికి సరైన భద్రతను చేకూర్చాలి. ఈ పీటకు యీ మూడు కాళ్లను అనుసంధానంచేస్తూ కొన్ని స్క్రూలు వేసి తిప్పాలి. అప్పుడే యీ పీట మనకు వుపయోగకరముగా వుంటుంది. ఈ మూడు కాళ్లే ఉత్పత్తిదారులు, రక్షకభటులు, అధ్యాపకులు. ఈపైన వుండిన సున్నితమైన పీటయే ప్రజా సమ్మిళితమైన స్వరూపము. కనుక యీ ముప్వురుకూడను సమాజముమైన, ప్రకృతిపైన కొంతవరకు ప్రేమాభిమానములు పెంచుకోవాలి. "ఈ ప్రజలందరు నావారు. ఈ ప్రజల క్షేమమే నా క్షేమము. ఈ సమాజములో నేనుకూడను ఒకడిని. సమాజము చల్లగా ఆనందముగా వుండినప్పుడే నేనుకూడను చల్లగా ఆనందముగా వుండగలను. నా సుక్షేమములన్నికూడను సమాజముపైన ఆధారపడివున్నవి", అనుకోవాలి. ప్రేమ విశాలమైనదిగా వుంటుండాలి. ఈ ప్రేమ అనే పీటను శాంతి, ధర్మము, సత్యము అనే మూడు స్క్రూలతో బిగించి భద్రపరచాలి. సత్య, ధర్మ, శాంతి, అహింసలయొక్క తత్త్వము మానవత్వములోపల ఇమిడియున్న తన స్వరూపముగా భావించి, విశ్వసించి ఆ విలువలను నిత్యజీవితములో ఆచరణలోనికి తెప్పించాలి.

**సత్యమార్గములో జీవించేవ్యక్తి హింసలో ప్రవేశించడు**

మానవతా విలువలలో ప్రేమ, సత్య, ధర్మ, శాంతి యీనాల్గింటియొక్క సమ్మిళితమైన స్వరూపమే అహింస. సత్యమార్గములో జీవించే వ్యక్తి హింసలో ప్రవేశించడు. ధర్మమార్గమును అవలంబించే వ్యక్తి హింసలో ప్రవేశించడు. ప్రేమతో జీవించే వ్యక్తి

sri sathyasai vachanamrutam

హింసలో యేమాత్రము పాల్గొనడు. శాంతముతో జీవించే మానవుడు హింసలో ప్రవేశించడు. కనుక, సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలు మానవునియొక్క పంచప్రాణములుగా విశ్వసించాలి.

సమాజములో అన్నింటికిని ప్రధానమైనది శిక్షకస్థానము, పాలకులు కేవలము తమ పాలనాకర్తవ్యమును మాత్రమే నిర్వర్తించుకుంటూపోతారు. కాని శిక్షకులైన అధ్యాపకులను ప్రోత్సహించేవారుగాకూడా వుండాలి. యావత్ జగత్తుయొక్క సుక్షేమము అధ్యాపకులయొక్క భావములపైననే ఆధారపడివుంటుంది. 'సా విద్యా యా విముక్తయే' అన్నారు. అనగా బాధలను, బంధనలను, కష్టములను, విచారములను దూరముగావించి శాంతి సంతోషములను అందించేది విద్య. యీ ప్రపంచమే ఒక గ్రంథము. కర్మయే నిజమైన అధ్యాపకుడు. కనుక, మన కర్మలు సత్ కర్మలుగా, పవిత్రమైన కర్మలుగా, దివ్యమైన కర్మలుగా మనము ఆచరించినప్పుడే యీ ప్రపంచమనే గ్రంథమును మనము అధ్యయనం చేసిన వారమవుతాము. ప్రపంచము కేవలము వట్టి గ్రంథము మాత్రమే కాదు. ఒకొక్క సమయమునందు అది అధ్యాపకుడుగాకూడా రూపొందుతుంది. ప్రపంచములో మనము నేర్చుకోవలిసినవి, నేర్చుకొనుచున్నవి ఎన్నో వుంటున్నాయి. అందువలననే Nature is the best teacher అన్నారు. ఇక్కడ Nature అనగా యేమిటి? ఈ యింగ్లీషు పదములో అనేక అర్థములు ఇమిడియున్నాయి. ప్రకృతియొక్క వాతావరణమని అంటుంటారు. ప్రకృతి అనగా ఏమిటి? మన దేహాన్నికూడను ప్రకృతి అని పిలువ వచ్చును. కర్ణాటక దేశములో యీ దేహమును ప్రకృతి అని వుపయోగపెడుతూవుంటారు. నా ప్రకృతి సరిలేదు అంటుంటారు. అనగా ఆరోగ్యము సరిలేదు అని. కనుక, ప్రకృతి తత్త్వమనగా యేమిటి? మన దేహసంబంధమైన నడతలు, క్రియలు, భావములు, తలంపులు, పలుకులు అన్నీకూడను సక్రమమైనవిగా వుంటుండాలి. మన నడతలు సక్రమమైన నడతలుగా వుంటుండాలి. మన పలుకులు వుపయోగకరమైనట్టివిగను, పరులను నొప్పించని పలుకులుగాను వుంటుండాలి. మన తలంపులుకూడను యే విధమైన తప్పు మార్గములో ప్రవేశించని తలంపులుగా వుంటుండాలి. ఇలాంటి నిత్యజీవితములో మనము ఆచరించవలసిన విషయములను విద్యార్థులకు బోధించటమే నిజమైన బోధ.



sri sathyasaivachanamrutam

విద్యార్థులయొక్క శక్తి, సామర్థ్యములు కేవలము గురువునుండి పొందిన ప్రసాదములుగా విశ్వసించాలి. గురువులయొక్క విలువ విద్యార్థులయొక్క విజయాలపైనను, వారినడతలపైనను ఆధారపడివుంటుంది. ఒక విద్యార్థి తన విజయము మరియు నడతల విషయములో సక్రమమైన మార్గము అవలంబిస్తున్నాడంటే లేదా ఒక విద్యార్థి సాధిస్తున్న ఫలితములు చాలా బలహీనమై వుంటున్నాయంటే అది కేవలము అధ్యాపకుని ప్రభావమే!

**అధ్యాపకుల ఔన్నత్యమును విద్యార్థుల ప్రవర్తన మరియు వారు సాధించిన విజయములనుబట్టి గుర్తించవచ్చును.**

ఒకానొక సమయములో భోజరాజు సభలో యిరువురు గురువులు వాదోపవాదములకు సిద్ధమయ్యారు. ఇరువురుకూడను సమాన శక్తి సామర్థ్యములు కలిగిన పండితులే కనుక వాదోపవాదములు యెంతకాలము కొనసాగినప్పటికి యెవరుకూడను బలహీనులు కాలేదు. ఇక జయాపజయములు ఎవరివో నిర్ణయించడం ఆసాధ్యమని భావించి యిరువురి శిష్యులను పిలిపించారు. భోజరాజు వారి శిష్యులను ఇరువురిని ఎంపిక చేసి వారిద్దరి మధ్య వాదోపవాదములు పెట్టాడు. దానికి వారి గురువులుకూడను అంగీకరించారు. నా శిష్యుడు ఓడిపోతే నేను ఓడిపోయినట్టు అనే నిర్ణయానికి వారు సంసిద్ధులైనారు. అనాటి గురువులు సత్యమార్గము, నిశ్చయ మార్గము, నిర్మలమైన భావము కలిగిన నిండు హృదయులు కనుక యీ నిర్ణయానికి కట్టుబడినారు. గురువులవలే శిష్యులయందుకూడను ఏ విధమైన బలహీనత యేర్పడలేదు. ప్రజారంజితమైన, ధర్మబద్ధమైన వాదోపవాదములలో యిద్దరుకూడను పాల్గొన్నారు. ఈ విద్యార్థులయొక్క తత్త్వమును గుర్తించిన సభాసదులందరు వారి అధ్యాపకులయొక్క గుణములను, శక్తిసామర్థ్యములను వేనోళ్ల పొగిడారు. ఈ విధముగా అధ్యాపకులయొక్క ఔన్నత్యము విద్యార్థులయొక్క విజయాలపైనను, వారి నడతలను బట్టి గుర్తించటానికి వీలవుతుంది.

నిజముగా యీ జగత్తునందు అధ్యాపకులకంటే అధికముగా ఉత్తమస్థానము మరియు శక్తి సామర్థ్యములు కలిగినవారు యెవరుకూడ వుండరనియే చెప్పవచ్చు. సాధారణంగా ఏ దేశములోనైనా ఒక ప్రెసిడెంటు, ప్రైమినిష్టరు చాలా వున్నతస్థాయిలో వుండిన వ్యక్తులని

sri sathyasaivachanamrutam

భావిస్తుంటారు. కాని, ఆ ప్రెసిడెంటుకుగాని, ప్రైమినిష్టరుకుగాని ఆ స్థానాన్ని అందించినవారు అధ్యాపకులే! యీనాటి అధ్యాపకులలో అలాంటి సచ్ఛీలురు, శక్తి సామర్థ్యములు కలిగినవారు లేకపోవటంచేత విద్యార్థులకు సరియైన విద్యాబుద్ధులు చెప్పే అధ్యాపకులు కరువైనారు. అధ్యాపకులనగా యేదో బలహీనమైన స్థానములో వుండిన వారుగా మనము భావించరాదు. ఏదో ఒక ఉద్యోగం, ఏ ఉద్యోగం లభించకపోవటంచేత అధ్యాపక ఉద్యోగములో ప్రవేశించినామనే భావమునకు అధ్యాపకులు తావు యివ్వరాదు. ప్రపంచములో వుండిన ఉన్నతాధికారులందరికంటే అధ్యాపకుల అధికారము చాలా గొప్పది, వుత్తమమైనది. దానిని సద్వినియోగపరచుకున్నప్పుడే అంతటి ఉన్నతస్థానమునకు వారు అర్హులవుతారు.

### WATCH యొక్క అంతరార్థమును గుర్తించాలి

ఈనాటి మానవుడు పవిత్రమైన భావములు, మానవతా గుణములు అభివృద్ధి పరచుకోవాలి. ఆ మానవతా విలువలే సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలు. ఒక చిన్న ఉదాహరణము. మనము చేతికి ఒక watch కట్టుకుంటున్నాము. ఈ watch యొక్క అంతరార్థము ఏమిటి? అది కాలమును నిర్ణయించేటువంటిది. కేవలము కాలమును నిర్ణయించటము మాత్రమే కాదు, ఒక అలంకారముగా వుంటుందికూడ. ఈనాటి మన వాచీలన్ని కేవలము కాలమును నిర్ణయించటము మరియు అలంకారముగా ఉపయొగపడటంవరకే! ఈ వాచీలు వచ్చిన క్రొత్తలో మన భారతీయులు దీనిని చూచి యేదో ఒక విచిత్రముగాకూడను భావించారు. అప్పుడు యీ దేహానికి తొమ్మిది సంవత్సరములు. ఆ సమయములో నేనొక ప్రభోధాత్మకమైన గీతం చెప్పాను:

**ఎడమ చేతి కడాన యెందో తెలతెల్ల బిళ్ల**
**తోలు పట్టెడ గట్టి యాలాడ గడ్డారు**
**ఏటి యేషాలప్ప యివి**
**కంటిలో జూచేకి కాని అవతారాలు**
**ఏటి వేషాలప్ప యివి**

srisathyasaivachanamrutam

యేదో తెల్లటి బిళ్లను ఒక తోలు పట్టీ కట్టి వేలాడవేస్తుంటే యిది యెందుకోసం కడుతున్నారు అన్నట్టుగా ప్రజలు చాలా ఆశ్చర్యపడేవారు. అయితే, ఆవాచీలో వున్న అంతరార్థము నాడుగాని, నేడుగాని గుర్తించిన వ్యక్తులు చాలా తక్కువ. ఈనాటికికూడను దానిని అందముగా, కాలము నిర్ణయము చేసే ఒక వస్తువుగా మాత్రమే భావిస్తున్నారుగాని దాని అంతరార్థము ఎవరూ గుర్తించటంలేదు.

WATCH అనే ఇంగ్లీషు పదములో ఐదు అక్షరములు ఉంటున్నాయి. కాని, అంత మాత్రమేకాదు వాచీ. ఇది పంచ ప్రాణములనుకూడా సూచిస్తుంది. పంచాక్షరీ మంత్రమునుకూడా గుర్తుచేస్తుంది. 'నమఃశివాయ' అని పంచాక్షరి చెపుతూ వుంటారు. కాదు. కాదు. WATCH అనే ఐదక్షరముల మంత్రమే పంచాక్షరీ మంత్రము. ఇది యెట్లు మంత్రమని నిర్ణయించగలరు? WATCH అనే పంచాక్షరములలో ఒక్కొక్క అక్షరమునకు ఒక్కొక్క నిగూఢమైన అర్థమున్నది. మొట్టమొదటగా 'W' 'watch your words' అని. అంటే, నోటికి వచ్చినట్లంతా వాగటముకాదు. "నీ నోటినుంచి వచ్చే ప్రతి పదముకూడను సత్యమైనదా కాదా, ఈ పదములవల్ల యితరులకు యేమైనా హృదయానికి గాయమవుతుందా, నీవు వుపయోగపెట్టే పదములు యితరులకు యేదైనా దుఃఖము కలిగిస్తాయా లేక ఆనందమును కలిగిస్తాయా అని విచారించాలి. ఇంకా నీ మాటలు ప్రియమైనవిగా వుంటున్నాయా, వుద్వేగముగా వుంటున్నాయా లేక అప్రియముగా వుంటున్నాయా అని విచారించాలి. మనం మాట్లాడే మాటలు ఎల్లప్పుడు ప్రియమైనవిగను, ఉపయోగకరమైనవిగను, యితరులకు ఆనందాన్ని అందించేవిగను, సత్యమైనవిగను వుండాలి అనే సంకల్పముచేత వాటిని మనము watch చేస్తూరావాలి. నోటినుండే పలికే ప్రతి పదమును watch చేయమని చెప్పి యీ W మనకు హెచ్చరిస్తూన్నాది. "హే మానవా! పవిత్రమైన నాలుక నీ కందించినందుకు నీవు యిష్టము వచ్చినట్లుగా వాగటానికి నీకు యేమాత్రము అధికారము లేదని నాలుకను హెచ్చరించ"మని యీ W అనేది చెప్తుండాది. ఇదే సత్యము. వాక్కు సత్యముతోకూడినది. కనుక, మొట్టమొదట watch your word యీ సత్యాన్ని నీవు ఆధారంగా చేసుకోమని మొట్టమొదట నిన్ను హెచ్చరిస్తూ వుంటున్నాది.

srisathyasaivachanamrutam

రెండవది A. A అనగా action. Watch your action. అనగా మనము చేసే ప్రతి పనియందుకూడను సత్యముతోకూడిన పని చేస్తున్నామా, ధర్మముతోకూడిన పని చేస్తున్నామా, యిది ధర్మవిరుద్ధమైనదా, సత్యరహితమైనదా అనేది మనము విచారణ చెయ్యాలి, ఈ action ని మనము ధర్మము అంటున్నాము. ధర్మమనగా ఏమిటి? 'ధారయతీతి ధర్మః!' ధరించినది ధర్మము అన్నారు. ఒక్కొక్క వస్తువుకు ఒక్కొక్క ప్రత్యేకగుణము వుంటుంది. ఆ ప్రత్యేకతను ఆ వస్తువు కోల్పోయినప్పుడు అది తన ధర్మాన్ని కోల్పోయినట్లే! ఉదాహరణకు అగ్ని వుంది. అగ్నియొక్క గుణములు ఏమిటి? అగ్నికి దహనశక్తి, ప్రకాశశక్తి అనే రెండు గుణములు వున్నవి. ఈ దహనశక్తిని, ప్రకాశశక్తిని తాను కోల్పోయి వుండినప్పుడు అది బొగ్గవుతుందిగాని అగ్ని కానేరదు. అనగా అగ్నికి వుండవలసిన శక్తి తనలో లేదు. తన ధర్మాన్ని కోల్పోయింది. కనుక, అది అగ్నికాదు. అది బొగ్గు అని రెండవ రూపాన్ని ధరిస్తుంది. చక్కెర వుంటుండాది. ఈ చక్కెరయొక్క గుణము ఏమిటి? తీపి. తనయొక్క గుణాన్ని తాను కోల్పోయిందంటే అది చక్కెర కానేరదు. ఏదో ఒక పిండి. అదే విధముగానే గులాబి పుష్పము వుంటుండాది. దానియొక్క గుణము యేమిటి? సుగంధమును అందించటము. అట్టి సుగంధము లేని గులాబినికూడ మనము చూడవచ్చును. యీనాడు ప్లాస్టిక్ గులాబిలు వుంటుంటాయి. కాని, అది సత్యమైన గులాబి కానేరదు. గులాబి గుణములు అందులో లేవు కనుక అది గులాబి కాదని మనము నిర్ణయిస్తున్నాము. అదే విధముగా మానవునికి వుండవలసిన గుణములు ఏమిటి? ఈ మానవునికి సత్యము ఒక ప్రధానమైన గుణము. పలికే పలుకులు ఎలాంటి పరిస్థితియందైననూ సత్యాన్నే పలకాలి. ఆ పలుకుల వల్ల ఎవరికి ఏ విధమైన బాధలు కలుగకుండావుండాలి. రెండవది ధర్మము. ఈ ధర్మమనేది మానవతావిలువలు యేమాత్రము పెడమార్గము పట్టకుండా సక్రమమైన మార్గములో దీన్ని తాను అనుసరించాలి. తరువాత, శాంతము అని వుంటుండాది. శాంతమనగా యేమంటే ఎవరేమన్నను సహించుకొని వుండటం శాంతమనుకొంటున్నాము.

ఈ గడియారములో వుండిన T యిదే thought. తలంపులు పవిత్రమైనవిగను, దివ్యమైనవిగను, దైవత్వముతో కూడినవిగను, సత్యధర్మములతో కూడినవిగను



sri sathyasai vachanamrutam

వుండినప్పుడే అట్టి తలంపులు కలిగిన హృదయము ప్రశాంతముగా వుంటుంది. సత్య, ధర్మములతో హృదయములోపల తలంపులుగా వుండినప్పుడు శాంతి అనేది సహజముగానే ఏర్పడుతుంది. దీనికొక చిన్న ఉదాహరణము. ఎవరైనా మనలను దూషించారు లేక విమర్శించారు. ఆ సమయములోపల ఆ పదములను నీవు ఆధారము చేసుకొని వుద్రేకుడై వారిపైన దుముకకూడదు. అతను పలికిన పలుకులు సత్యమైనవా, ఆ దోషములు నాలో వున్నవా, లేదా అనే విషయాన్ని మనము విచారించాలి. అతని నిందలు నా ప్రవర్తనకు, ధర్మమునకు విరుద్ధమైనవా లేక దాని ననుసరించియే వున్నవా అని విచారించాలి. నా నడతకు అతని విమర్శలకు యేమాత్రము సంబంధము లేనప్పుడు నేను ప్రశాంతముగానే వుంటుండాలి. నేను ఎందుకు వుద్రేకమునకు అవకాశము యివ్వాలి? కనుక watch your words and watch your action. ఈ రెండిటిని watch చేసినప్పుడు శాంతము సహజముగానే వస్తుంది. శాంతమనేది మహర్షులయొక్క ఆభరణము. ఈ శాంతము స్వార్థపరులదగ్గర వుండటానికి అంగీకరించదు. అహంకారము కలిగినవారిని చూస్తే పరుగెత్తిపోతుంది, శాంతము. శాంతము సత్యముతో, ధర్మముతో వుండిన వానితో మాత్రమే తాను సహవాసము చేస్తుంది. స్వార్థ, అహంకార, రాగములతోకూడినవారి దగ్గర క్షణమైనా నిల్చదు. కనుక, యీ శాంతమనేది సత్యధర్మములతో కూడినప్పుడు ఆ తలంపులు వాటంతటఅవే శాంతముగా రూపొందుతాయి.

ఇక, నాలుగవ అక్షరము, C. అనగా Character. ఇది watch your character అనే సూచన నందిస్తుంది. Character మానవునకు అత్యంత ప్రధానమైనది. ప్రాణము వంటిది. Character is 3/4 of life అన్నారు. ప్రేమలేని జీవితము మరణముతో సమానము. కనుక, ప్రేమ ప్రధానమైన గుణము. దానిని నీవు చక్కగా విచారించు. Character అనగా కేవలము సదాచారములో వుండటము, అన్యాయములో ప్రవేశించకుండా వుండటము, అక్రమాలు చేయకుండా వుండటము, యింత మాత్రమేకాదు. మానవత్వాని మలచుకోవాలి. క్రియాశీలత వెల్లి విరియాలి. సమాజముయొక్క సౌభాగ్యమును అభివృద్ధిపరచాలి. ఇంతేకాదు. ఆత్మకోసము బ్రతకాలికాని అన్నముకోసముకాదు. నిజముగా యీ గుణములు లేని జీవితము దీపము లేని

sri sathyasai vahini vachanamrutam

కొంపవంటిది. త్రాడు తెగిన గాలిపటమువంటిది. చెల్లని కాసువంటిది. ఇలాంటి జీవితమును మొట్టమొదట సరైన మార్గములో character కు తగిన రీతిలో మలచుకోవాలి. అదేప్రేమ, నిస్వార్థమైన ప్రేమ. నిరహంకారమైన ప్రేమ, నిరాడంబరమైన ప్రేమ. ఈ ప్రేమయే మన నిజమైన character. ఇదే నిత్యమైనది. ఇదే సత్యమైనది. ఈ characterను పూర్వము వుండిన సత్యము, ధర్మము, శాంతి యీ మూడింటితో జతపరచాలి. నాగుణము సత్యముతో వున్నదా, ధర్మముతో వున్నదా, శాంతముతో వున్నదా, అని watch చెయ్యాలి. ముందు వుండిన యీ మూడింటిని మనము చక్కగా విచారించుకుంటే character కూడా స్వస్వరూపాన్ని ధరిస్తుంది.

ఇక ఐదవది. H. Heart. ఈ heart అనగా ఏమిటి? శారీరక సంబంధమైన గుండెకాదు. శారీరక సంబంధమైన గుండె పిడికెడు మాత్రమే వుంటుంటాది. Heart అనగా విశాలత. నీ హృదయము సంకుచితముగా వుందా లేక విశాలముగా వుంటున్నదా? నీ విశాలమైన హృదయము సత్యధర్మశాంతిప్రేమలతోకూడి వున్నదా లేక విరుద్ధముగా వున్నదా? విచారించుకోవాలి. విశాలమైన భావము నీలో అభివృద్ధి అయ్యేటప్పటికి సర్వము నేనే అనే సమత్వము ఏర్పడుతుంది. అప్పుడే 'మమాత్మ సర్వ భూతాంతరాత్మ' అనే భావము కలుగుతుంది. ఈ భావము నీలో స్థిరపడేటప్పటికి ఎవరిని హింసించినా నిన్నే హింసించుకున్నవాడవుతానని తెలుసుకుంటావు. ఎవరిని బాధించినా నిన్నే బాధించుకున్నవాడవౌతావు. ఇలాంటి సత్యాన్ని గుర్తించుకున్న సమయములో యింక హింసలలో ప్రవేశించటానికి అవకాశము వుండదు. ఇదే అహింసా తత్త్వము.

**మానవతా విలువలు కోల్పోవడంచేతనే రాక్షసులకంటే హీనముగా ప్రవర్తిస్తున్నారు**

కనుక యీ WATCH అనే అయిదక్షరములుకూడను పంచాక్షరీ నామముగా మనము స్వీకరించాలి. ఇవే మానవుని పంచప్రాణములుగా విశ్వసించాలి. ఈ పంచాక్షరములు, పంచప్రాణములు లేని జీవితము కేవలము వృధా! ఆకారమును బట్టి మానవుడని చెప్పటానికి సాధ్యమవుతుందా? కాదుకాదు. నీవు కేవలం ఆకార మానవుడవు కావచ్చునేగాని నిజమైన మానవుడవు కాలేవు. మానవతా విలువలు కలిగిన మానవుడు

sri sathyasai vacharamrutam

కాలేవు. చెప్పిన మాటను నిలబెట్టుకోలేని వాడు మానవుడవుతాడా? ఇచ్చిన మాటను కాపాడుకోలేనివాడు మానవుడవుతాడా? నీ కర్తవ్యమును నీవు నిర్వర్తించుకోలేని దౌర్భాగ్యుడవు నీవు మానవుడెట్లవుతావు? ఇలాంటివాడు ఆకార మానవుడేగాని ఆత్మతో చేరిన మానవుడు కానేరడు.

**ఆకుపచ్చ పక్షులన్ని చిలుకలవలె పలుకునా**
**పూవులపై పారాడెడు పురుగులు తుమ్మెదలగునా**
**పులిచర్మము కప్పినట్టి గాడిద తాపులియగునా**
**ఏనుగంత బలసియున్న పంది ఏనుగగునటయ్యా!**

కాదు, కాదు. ఆకారములు ధరించినంత మాత్రమున మానవుడుకాదు. మానవతా విలువలను పెంచుకోవాలి. అప్పుడే మానవుడుగా తాను రూపొందుతాడు. ఈనాడు అట్టి మానవతా విలువలు కోల్పోవటముచేతనే ఎక్కడ చూచినా రాక్షసులకంటే హీనముగా ప్రవర్తిస్తున్నారు. ఏ పేపరైనా మీరు చూడండి. తెల్లవారి లేచి తెరిచేటప్పటికి ఎక్కడ చూచినా చావులు, ఖూనీలు, కాల్చుకోవటాలు. ఎంత అపవిత్రమైన మానవతా విరుద్ధమైన చర్యలను అనుభవిస్తున్నాది యీ లోకము! మానవత్వమే మరుగైపోయింది. సమాజము కల్మషమైపోయింది. సరైన వ్యక్తిత్వము యెక్కడా కనిపించటంలేదు. మన చదువుల వల్ల మన వ్యక్తిత్వాన్ని మనము అభివృద్ధిపరచుకోలేము. ఈనాడు మనము చదివే చదువులు నిజమైన చదువులు కానేకాదు. ఈ చదువులు మనలను అహంకారిగా మార్చివేస్తున్నాయి. ఆడంబరమైన జీవితములో ప్రవేశింపచేస్తున్నాయి. అసత్యమైన నడతలు నడుచుకుంటున్నారు. అప్రమాణమైన జీవితము గడుపుతున్నారు. ప్రమాణమనేది ఎక్కడా కనుపించటము లేదు. కనుక, యీనాడు మానవతా విలువలు తప్పక పోషించాలి. యీ మానవతా గుణములుకూడను స్వార్థరహితముగా వుంటుండాలి. పేరు ప్రతిష్ఠలకై మనము ప్రాకులాడరాదు. మన హృదయసంతృప్తికై మనము అర్పితము గావించాలి.

**మానవునిగా పుట్టినందుకు మానవస్వేచ్ఛను అనుభవించాలి**

మానవునియందున్న ప్రేమ చాలా పవిత్రమైనది. ఈ ప్రేమ బయటినుండి

sri sathyasai vachanamrutam

తెచ్చుకోవటంగాని అప్పు యిచ్చుకోవటంగాని జరిగే వస్తువు కాదు. మనస్ఫూర్తిగా మనలను మనం అర్పితము గావించుకొనేది. ఈనాడు గ్రంథపరిచయమునంతా మనము విద్యగా భావించి చాలా మోసపోతున్నాము. మనలో వున్న మానవతా గుణములు మొట్టమొదట ఆవిర్భవింపజేసుకోవాలి. మన కర్తవ్యాన్ని నిర్వర్తించాలి. ఎలాంటి యిబ్బందులు వచ్చినప్పటికి, ఎలాంటి అవాంతరములు వచ్చినప్పటికి మన కర్తవ్యములో కించిత్తైనా లోపము జరుగరాదు. ఎవరెవరు ఏఏ వృత్తిలోపల దానికి ఆధీనులైనారో, నిర్ణయించుకున్నారో, ఆ వృత్తిని సక్రమముగా నిర్వర్తించినప్పుడే వాడు మానవుడవుతాడు. ఈనాడు ఆధ్యాపకవృత్తిలో వుండిన మనము మన కర్తవ్యాన్ని చక్కగా నిర్వర్తిస్తున్నామా లేదా, పిల్లలకు అర్థమయ్యేరీతిగా మనము బోధిస్తున్నామా లేదా, వారిని సరైన మార్గములో ప్రవేశపెడుతున్నామాలేదా అనేది మనకు మనము విచారించుకోవటమేకాకుండా మన నడతలోకూడను చూపించాలి. మన నడతలే వక్రముగా వుంటున్నప్పుడు యిక మనకు యితరులను బాగుపరచే అధికారము ఎక్కడుంది? కేవలము మనము పొట్టకూటకోసం ప్రాకులాడుతున్నామేగాని, పిల్లలయొక్క అభివృద్ధికోసంగాని, లేక మానవతా విలువలకోసంగాని పాటుపడినవారము కాలేకపోతున్నాము. ఎంత నింపుకున్నను యీ పొట్ట నిండేదికాదు. పశుపక్షిమృగాదులు మాత్రము పొట్టలు నింపుకోటంలేదా! కొంతమంది యీనాటి పిల్లలు ప్రశ్నిస్తూవుంటారు: 'స్వామీ! మానవునికి ఎందుకింత నియమనిబంధనలు వుంటున్నాయి? మానవుడు ఎందుకు స్వేచ్ఛగా వుండకూడదు? పశుపక్షిమృగాదులు స్వేచ్ఛావిహారము జరుపుతున్నాయికదా, మానవుడు ఎందుకు స్వేచ్ఛగా వుండకూడదు. నిజమే! పక్షులు అతిస్వేచ్ఛగా సంచారము చేస్తున్నాయి. మృగములు తమ స్వస్థానములో అనగా అరణ్యములో స్వేచ్ఛావిహారము గావిస్తున్నాయి. నీవుకూడను స్వేచ్ఛగా వుండవచ్చుగాని ఒక్కటి మాత్రము గుర్తించుకోవాలి. పక్షులు ఏ విధమైన స్వేచ్ఛను అనుభవిస్తున్నాయి. మృగములు ఏ స్వేచ్ఛను అనుభవిస్తున్నాయి. మృగస్వేచ్ఛను అనుభవిస్తున్నాయి. నీవు మానవుడవు కనుక మానవస్వేచ్ఛను అనుభవించు. మానవుడై పుట్టి మృగస్వేచ్ఛ అనుభవిస్తే అది ధర్మమవుతుందా? నీవు మానవుడై పుట్టి మృగములవలే స్వేచ్ఛగా తిరగాలని ఆశిస్తున్నావు. అలాచేసినప్పుడు నీవు మృగమేకాని

sri sathyasai vachanamrutam

మానవుడుఎట్లవుతావు? ఆకారమునకే మానవుడవుకాని, ప్రవర్తనలో మాత్రము నీవు మృగము. అటువంటివారిని ఆకారమానవుడని పిల్వవచ్చునేగాని ఆచార మానవుడు అని చెప్పటానికి వీలులేదు.

## ఆకారమానవునిగా కాక, ఆచారమానవునిగా జీవించాలి

రామాయణములో చక్కని ఆదర్శము వుంటుండాది. శ్రీరాముడు వాలిని చంపటానికి పోయినప్పుడు వాలి అతనిని ప్రశ్నిస్తున్నాడు: "రామా! నేను ఏ దోషము చేశాను? ఎందుకోసం నీవు చంపటానికి వస్తున్నావు?" అప్పుడు రాముడు "నీవు ధర్మవిరుద్ధమైన ప్రవర్తనలో నీ జీవితాన్ని వ్యర్థము గావించుకుంటున్నావు", అన్నాడు. "నేను ఏమి ధర్మము తప్పాను?" అని మరల రాముని అడిగాడు. "నీ సోదరుడైన సుగ్రీవునియొక్క పత్నిని నీవు స్వీకరించావు. తమ్మునియొక్క భార్య అన్నకు తల్లితో సమానము. ఆమెను నీవు భార్యగా అనుభవించటము మహాపాపము", అని తెలియచెప్పాడు రాముడు. అప్పుడు వాలి "యిది మానవులకు మాత్రమే సంబంధమవుతుందిగాని మా వానరులకు వర్తించదు. రామా! నీ పరిపాలన, నీ ధర్మాచరణ మానవులకు మాత్రమే సంబంధముగాని అడవులలో సంచరించే మృగములకు సంబంధము లేద"న్నాడు. అప్పుడు రాముడు "నిన్ను మృగముగానే భావించి శిక్షిస్తున్నాను", అని అన్నాడు.

యీనాడు మానవుడు కేవలము ఆకారమానవుడుగా వుంటున్నాడుగాని చేష్టలలోపల వానరునిగా, మృగముగా తన జీవితాన్ని గడుపుతున్నాడు. యిక్కడ నడత ప్రధానముగాని, ఆకారము ప్రధానముకాదు. ఆకారము ఏదైనా కావచ్చును. యీ ప్రపంచములో అనేక విద్యలను నేర్చి కొన్ని రకములైన వున్నతస్థాయికి చెందినవారమని మానవులు భావించవచ్చును. అభ్యాసములచేత అన్ని విద్యలు నేర్వవచ్చు మానవుడు. మానవుడే కాదు, మృగములుకూడను అభ్యాసముతో అన్ని విద్యలు నేర్చుకుంటున్నాయి. మీరు చాలామంది చూచి వుంటారు. సర్కస్‌లో పోతే ఒక కోతికూడను సైకిలు త్రొక్కుతుంది. ఒక గొఱ్ఱెకూడను స్పూన్‌తో తింటుంటాది. ఇవన్ని ట్రైనింగుతో, ప్రాక్టీసుతో కొన్నిరకములైన విద్యలు



sri sathyasai vahamrutam

నేర్వవచ్చు. ఈనాడు మానవులు మానవతా గుణములను మరచి తెచ్చిపెట్టుకున్న కృత్రిమమైన గుణములతో జీవితమును వక్రమార్గము పట్టిస్తున్నారు. కనుక, ఆధ్యాత్మిక మార్గములో, నైతిక మార్గములో, ధార్మిక మార్గములో వుండిన మానవత్వాన్ని చక్కగా గుర్తించటానికి ప్రయత్నించాలి, మానవులు.

**WATCH అనేది సత్య శివ సుందర స్వరూపమే!**

ముఖ్యముగా మాటలు, క్రియలు, ఆలోచనలు, శీలము మరియు పవిత్ర హృదయము అనే ఐదు మానవతా గుణములను గురించి హెచ్చరించే WATCH యీ ఐదింటిని, ఐదుప్రాణములుగా, పంచాక్షరిమంత్రముగాకూడను మీరు ఆచరించి ప్రచారం చెయ్యాలి. కాలమే పరమాత్ముని స్వరూపము. కాబట్టి watch టైముకూడ ఒక ప్రక్కచూపుతున్నాది. గుణములను మరొకవైపున చూపుతున్నాది. అందాన్ని యింకొకవైపున చూపుతున్నది. కనుక, యీ WATCH అనేది 'సత్యంశివంసుందరం' స్వరూపమే! అలంకారమును యిస్తుంది. సత్యం అనే మానవతా గుణాన్ని పోషిస్తున్నాది. శివం నిరంతరము వుంటుండాది. అదేకాలము. కనుక ఉపనిషత్తులంతాకూడను 'కాలకాలప్రపన్నానాం కాలంకింనకరిష్యతి', అని చెప్పాయి. కాలమును మనము స్వాధీనము చేసుకోలేముగాని కాలతత్వాన్ని మనము అనుభవిస్తున్నాము. కాలమును అందరు అనుసరించవలసినదేకాని కాలము ఎవరిని అనుసరించదు. కాలస్వరూపుడు పరమాత్ముడు కనుక అతనిని శివుడు అన్నారు. కనుకనే 'కాలాయనమః, కాలకాలాయనమః, కాలదర్పదమనాయనమః, కాలస్వరూపాయనమః, కాలనియమితాయనమః', అని పరమాత్ముని పూజిస్తున్నారు. అంతాకాలమే! నిత్యజీవితములో మీరు ధరించే యీ WATCH ని చూచినప్పుడంతాకూడను "నేను పంచప్రాణ స్వరూపుణ్ణి, పంచాక్షరీమంత్రాన్ని, సత్యంశివంసుందరం, ఉపనిషత్తుయొక్క వాక్యాన్ని", అని అనుకున్నప్పుడు మీరు యే విధమైన పెడమార్గము పట్టటానికి అవకాశము వుండదు.

**మానవతా విలువలను బోధిస్తే సరిపోదు, నిత్యజీవితంలో ఆచరించాలి**

కనుక, చిన్నచిన్న పిల్లలందరికి యీ సున్నితమైన మార్గములో మానవతా విలువలు

srisathyasaivahini

బోధించటానికి మనము ప్రయత్నించాలి. కేవలము బోధించటములోనే మనకాలము పూర్తి చేసుకున్నామని అనుకోకూడదు. మన పని అయినదని భావించరాదు. మనముకూడను వాటిని ఆచరణలో పెట్టాలి. పదిసంవత్సరములనుండి యీ మానవతా విలువలను బొధిస్తున్నామేగాని, ఆచరించటములేదు. కనుక, మొట్టమొదట బొధించే వ్యక్తులము మనము వాటిని ఎంతవరకు ఆచరిస్తున్నామనేది watch చేసుకోవాలి. ఇతరులకు చెప్పినప్పుడు నేను అది చేస్తున్నానా అని watch చేసుకోవాలి. అదే self watch. ఈనాడు లోకమంతా మన ఆచరణను ప్రధానంగా పరిగణనలోనికి తీసుకుంటుందిగాని ప్రబోధలు, ప్రచారములు యేమాత్రము తీసుకొనదు. లెక్చరు చెప్పేవారు కోట్లకు కోట్లకు వుంటున్నారు. మన టీచర్లంతా పోయి మునిస్పాలిటి లేదా కార్పొరేషన్‌వారి టీచర్సుకు మానవతా విలువల గురించి సులభముగా చెప్పవచ్చు. అయితే ఆ టీచర్సుకూడా ఏమి brainless వాళ్లుకాదు. ఈ చెప్పేవ్యక్తి ఎంతవరకు వాటిని ఆచరిస్తున్నాడో వాళ్లు watch చేస్తారు. కనుక యీ watch అనేది కేవలం చేతికే కాదు, సర్వత్రవుంటున్నది. భగవంతుడుకూడను ఒక watchman. ఎవరు ఎవరు ఏమి చేస్తున్నారో తానుకూడా watch చేస్తుంటాడు. కనుక మనము యేదో అధికారులమనుకొని మనమంతా యితరులకు బోధిస్తున్నామనే అహంకారములో పడకుండా చూచుకోవాలి. ఇతరులకు నూరు చెప్పుతున్నాము కదా ఒకటైనా మనము ఆచరిస్తున్నామా అని మనం విచారించాలి. ఆచరణ లేకుండా మీరు వేయిసంవత్సరములు ప్రబోధలు చేయండి, ప్రయోజనము లేదు. కేవలం ప్రచారముతో మారే కాలముకాదు, యీ కలియుగము. ప్రబోధలతో మారేదికాదు, యీ కలియుగము. ఆచరణతోనే మనము నిరూపించుతూ రావాలి. ఆచరణలేకుండా ఎంత ప్రచార, ప్రబోధలు చేసినప్పటికి కాలము వ్యర్థము, ధనము వ్యర్థము.

**మానవతా విలువలే మనలను ఉన్నతస్థాయికి కొనిపోయేవి**

మన సంస్థయొక్క నిబంధనలలోపలకూడను ceiling on desires అని పెట్టాము. దీంట్లో do not waste time, do not waste money అనేవి కొన్ని ముఖ్యాంశములు. పదిమంది మెచ్చుకొనే కోసమని ఆడంబరములో మనము ప్రవేశించరాదు. ఇన్ని

srisathyasai vahinamrutam

వేలమందికి అన్ని వేలమందికి అంతా మనము ట్రైనింగు యిచ్చామని అహంకార పడటానికి అవకాశములేదు. ఇన్ని వేలమందిలో ఎంతమంది తేలినారు మంచివారు, మనకు? బయటివారు ఎవరూ లేకపోయిననూ మనకు మనమైనా ఈ సూత్రములను ఆచరించాలి. ఆ విధమైన self satisfaction మనకు రావాలి. ఆ self satisfaction లేనప్పుడు యింక మనకు self realisation ఎక్కడ కలుగుతుంది? మొట్టమొదట యీ self satisfaction కొరకు self confidence develop చేసుకోవాలి. మానవతా విలువలు మనలో వున్నాయిగాని, బయటలేవు. మనము ఆచరణలో పెట్టి యితరులకు చూపించే ప్రయత్నముచేతనే యెంతైనా వారిని మార్చగలము. అంతేకాని అనవసరంగా యెక్కువ చెప్పి మనం చేయలేకుండాపోతే దానికి విరుద్ధమైన మార్గాన్నికూడను అనుభవించవలసి వస్తుంది.

**చెప్పవచ్చు కోటి చేయరు ఒక్కటి**
**చెప్పుట సులభంబు చేయుట కష్టంబు**
**ధాతకైన వాని తాతకైన**

కనుక మనము చెప్పేదానికంటే చేసి చూపించే దాంట్లో శిక్షణ పొందాలి. మొట్టమొదట మానవతా విలువలను మనం అభివృద్ధిపరచుకోవాలి. మనలో వున్న రాగద్వేషాలు పూర్తిగా అణచుకోవాలి. అసూయా ద్వేష భావములకు, ఆడంబరాలకు ఏమాత్రము అవకాశము యివ్వకుండా చూచుకోండి. కర్తవ్యాన్ని చక్కగా నిర్వర్తించండి. నీవు ఏ డ్యూటీ తీసుకున్నావో దానిని హృదయపూర్వకముగా చేయటానికి ప్రయత్నించాలి. నీవు అధ్యాపకుడవు. ఈ అధ్యాపక వృత్తిని నీ హృదయమునకు తృప్తి కలిగించే రీతిలో నీవు చేయాలి. 'ఏదో తెల్లవారి తొమ్మిది గంటలనుండి సాయంకాలము నాలుగుగంటలవరకు కాలేజికి పోవాలి, స్కూలుకు పోవాలి' అని, కాలాన్ని మాత్రమే ఆధారము చేసుకొని నడచరాదు. మన బోధ పిల్లలకు సక్రమముగా అందిందాలేదా, సరైన రీతిలో వారు అర్థము చేసుకున్నారాలేదాఅని ఒకతూరి కాదు, రెండుతూర్లు వారిని అడిగి పూర్తిగా సంతృప్తి పరచాలి. అట్లుకాకుండా 'వాడు వింటే

వినసీ, పాస్ అవుతే అవుతాడు, ఫేలైతే అవుతాడు నా డ్యూటీ నాకు అయిపోయింది', అని కేవలము కృత్రిమమైన ప్రాణములేని జీవితంగా నీవు జీవించరాదు. హృదయము కలిగిన మానవుడుగా నీవు బోధించాలి. ఈనాడు ప్రభుత్వములుకూడను కావలిసిన రక్షణలు జరుపుతున్నాయి. కాని, మానవతా విలువల రక్షణలో వారేమీ చేయటం లేదు. ఈ మానవతా విలువలను మనకు మనమే రక్షించుకోవాలి. అదే మన ప్రధానమైన కర్తవ్యము. అది రక్షించుకోకుండా మన యిండ్లు వాకిండ్లు, bank balance వీటిని చూసుకుంటూ పోతే అవి ఎంతకాలము వుంటాయి మనవెంట? ఒక్కటైనా మనవెంట వస్తున్నాయా? మన వెంటరానివి మనవి ఎట్లా అవుతాయి? మనవి కానివి మనవని భావించుకోవటం ఎంత పొరపాటు! ఏదీ మనదికాదు. మన వెంట వచ్చేది, మనతో ఉండేది, మనలను గౌరవింపజేసేది, మనలను అవమానపరచేది, మనలను ఉన్నతస్థాయికి తీసుకుపోయేది లేదా అథమస్థాయికి నెట్టేది మన విలువలే!

## స్వార్థమును అదుపులో ఉంచుకోవాలి

కనుక, మొట్టమొదట నేను మానవుడను, మానవతావిలువలైన సత్య, ధర్మ, శాంతి, ప్రేమ అహింసలను నేను పోషించుకోవాలని జీవితమంతా దానికి అంకితము చేయండి. అదే మీ జన్మకు సార్థకము. స్వార్థాన్ని త్యాగము చేస్తే పరార్థమును మనం చక్కగా పొందవచ్చు. స్వార్థమే అన్ని బంధనములకు మూలకారణము. మానవుని రాగద్వేషాలు బంధిస్తున్నాయని అనుకుంటున్నాము. అవికావు మనలను బంధించేవి, స్వార్థమే యిన్ని బంధనలకు మూలకారణమైంది. ఈ selfishness పోవాలి. నేను అప్పుడప్పుడూ చెబుతూ వుంటాను. Fish is better than selfish అని. ఆ fish జలములో సంచరించి ఆ జలములోని మాలిన్యాన్ని భుజించి జలమును శుభ్రపరుస్తుంది. కాని యీ selfishman సమాజములో సంచరించి సమాజమును dirty చేస్తున్నాడు. మాలిన్య పరుస్తున్నాడు. కనుక స్వార్థాన్ని త్యాగము చేసినప్పుడే పవిత్రమైన గుణములను మనము పోషించుకున్నవారమవుతాము. స్వార్థము పూర్తిగా లేకుండాపోతేకూడా వీలుకాదు. అయితే దానికి ఒక హద్దు కావాలి. హద్దు మీరితే మనిషి ఎద్దుగా మారతాడు. కనుక, మనము

sri sathyasai vachanamrutam

స్వార్థమును అదుపులో ఉంచుకోవాలి. ఎంతవరకు అవసరమో అంతవరకు దీనిని వుపయోగపెట్టుకోవాలి. ముఖ్యముగా మనము అభివృద్ధి పరచుకోవలసినవి, మన గుణములను.

## ప్రేమయే మీ నిజమైన స్వరూపము

ప్రేమస్వరూపులారా! ముఖ్యముగా మనము మానవతా విలువలను ఆచరణలో పెట్టటానికి, కనీసం ఒకటి రెండైనా, ప్రయత్నించాలి. నేను మిమ్మల్ని ఎడ్రస్ చేసేటప్పుడు ఎప్పుడూ 'ప్రేమస్వరూపులారా!' అంటాను. 'మానవస్వరూపులారా!' అనను. ఎందుకనగా ప్రేమయే మీ స్వరూపంగాని మానవ ఆకారం మీ నిజమైన స్వరూపముకాదు. ఆకారము నిజంగా జడమైనదిగాని, చైతన్యస్వరూపముకాదు. "నేను పుట్టినప్పుడు యింతే వున్నాను. యిప్పుడు యింత పెద్దగ పెరిగిపోయానే నేను జడస్వరూపుణ్ణి ఎట్లా అవుతాను, నేను చైతన్యస్వరూపుడను", అనుకోవచ్చు మీరు. కేవలం ఆకారములో పెరిగినంతమాత్రమున మీరు చైతన్యస్వరూపులుకాదు. దినము యిల్లు ఊడ్చి యింతచెత్త ఒక గుంతలో వేస్తుంటే ఒక సంవత్సరానికి ఒక పెద్ద దిబ్బమాదిరి పెరుగుతుంది. అదేవిధముగనే యీ దేహమునకు యిడ్లీసాంబారు, దోశ, అన్నము అన్నీ వేస్తుంటే యీ దిబ్బకూడ పెరుగుతుంది. యింతమాత్రమున పెరిగిన తక్షణమే యేదో చైతన్యమని భావించటము వెర్రితనము. కనుక, దేహము పెంచుకోటంకాదు గుణాన్ని పెంచుకోవాలి మనం. ఆ గుణములే సత్యధర్మశాంతిప్రేమ అహింసలు.

ఈ కలికాలంలో wrist watch లేనివారు లేరు. దాన్నిచూచినప్పుడంతాకూడను WATCH యొక్క అంతరార్థము

| | | |
|---|---|---|
| W | | WORDS |
| A | | ACTIONS |
| T | YOUR | THOUGHTS |
| C | | CHARACTER |
| H | | HEART |

sri sathyasai vachanamrutam

అని మనము తెలుసుకోటానికి ప్రయత్నించాలి. ఈవిధంగా మనం watch చేసుకుంటూపోతే మన జీవితం సార్థకమవుతుంది. ఇదే ఒక జపంగా తీసుకోవచ్చు. ఇదే ఒక ధ్యానంగా చేసుకోవచ్చు.

ప్రపంచములో ఉత్పత్తిదారులు, రక్షకభటులు, శిక్షక అధ్యాపకులు ప్రజలపైన ప్రేమను అభివృద్ధిపరచుకోవాలి. యీ ముమ్మూర్తులలోపల ఆధ్యాపకులు చాలా ప్రధానమైనవారు. కనుక, మీ అధ్యాపకస్థానాన్ని చాలా సార్థకం చేసుకోటానికి ప్రయత్నం చేసుకోండి. ఈ సభ ఇంకా రేపు, ఎల్లుండికూడ జరుగుతుంది. ఎల్లుండి మీ సమస్యలు యేమైనావుంటే లక్షణంగా నవ్వుతూ నవ్వుతూ సుఖంగా యీ సమస్యలు పరిహారం చేసుకొని ముమ్మందు యీ మానవతా విలువలు ఎంతైనా పోషించుకొని ప్రచారము సల్పి ఆచరించి, ఆనందించి యితరులకు అందించటానికి సంసిద్ధముగా వుండాలని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(తేదీ 7-03-1986న పూర్ణచంద్ర సభామండపంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam